# కోరుకోని కోవెల

చల్లని గాలి వీస్తోంది. ఆ సాయంకాలం పెరట్లో వేపచెట్టు కొమ్మకి వేసిన ఉయ్యాల ఊగుతోంది. శశి కట్టుకున్న లంగా, ఓణీ, గాలికి రెపరెపలాడుతున్నాయి. మెల్లని కూనిరాగం తీస్తోంది. కాని, ఆలోచనలు స్థిమితాన్ని పోగొడుతున్నాయి. చల్లనిగాలి వీస్తున్నా నుదుట చెమటలు పడుతున్నాయి.

మనసులో కోపం రోజు రోజుకి పెరిగిపోతోంది అక్క జయంతి అంటేను.

ఒకటి రెండుసార్లు జయంతితో దెబ్బలాడినా, అమ్మ ప్రతిసారీ అక్కని వెనకేసుకువస్తుంది ఏమిటి? ఈ మాటనే తండ్రి పరంధామయ్యతో చెప్పింది శశి మెల్లగా ఓసారి దగ్గరగా జేరి కూర్చుని - 'పోనీలే అమ్మా - ప్రతిదానికి నువ్వూ అక్కా దెబ్బలాడుకుంటుంటే ఎలా చెప్పు? ఎవరో ఒకరు సర్దుకుపోవాలి కాని,' అని శశికి నచ్చచెప్పాడు. ఈ పరిస్థితిలో ఎంతో, ఓర్పుగానే ఉంది. కాని, ఇవాళ బొమ్మరిల్లు కట్టడంలో పెద్ద దెబ్బలాటే వచ్చింది. మళ్ళీ తన ప్లాను అక్కకి నచ్చలేదు అంది. అమ్మ 'జయ కట్టిన బొమ్మరిల్లు చాలు, మళ్ళీ నువ్వు కట్టడం ఎందుకు?' అంది నేను చెప్పినట్లు వినకపోతే ఊరుకునేదిలేదు అంటూ ఒక్క దెబ్బ కూడా వేసింది వీపుమీద శశిని వాళ్ళమ్మ.

"అక్కని ఎందుకు కొట్టవూ?" అని అడిగితే, "అది రేపో, మాపో పెళ్ళైంది అంటే, అత్తారింటికి వెళ్ళే పిల్ల. అయినా, దాని పొడ అంటేనే కిట్టదు నీకు." శశిని మళ్ళీ వచ్చి కేకలేసింది. "చిన్నపిల్లవు, చెప్పగానే వినడం లేదేమిటి? ఊరికే పౌరుషపడిపోతావు?" అంది విశాలాక్షమ్మ. ఇలాంటివి ఎన్నో జరుగుతున్నాయి. ప్రతిదానికి నేను వింటున్నాను. నాకిష్టం లేనివి ఎన్నో చేస్తున్నాను.

అక్కకి పొట్టైన పరికిణీలు నన్ను కట్టుకోమంది. దానికి మంచి బట్టలు కొంటారు

ఈ జరీ అంచు జాకెట్టు దానికి బిగుతు అయింది, నువ్వు తొడుక్కో అంటే - సరేనని ఒప్పుకున్నాను.

అది చదివిన పుస్తకాలు, ఆ తర్వాత సంవత్సరం నన్ను చదువుకోమంటారు. ఎప్పుడూ సెకండ్‌హేండ్ బుక్స్ తనకి. అయినా ప్రతిక్లాసులోనూ అక్క కంటే ఎక్కువ మార్కులే వస్తున్నాయి.

టీచర్ శశిని పొగుడుతుంటే, జయ ఈర్ష్యగా చూసేది చెల్లెలుకేసి.

అదీ నాకు నచ్చదు, అని జయని అంటే, శశి బుగ్గలు గిల్లేది.

ఫ్రెండ్సు ఎవరేనా అక్క జయని, తక్కువ మార్కులు వచ్చాయని ఏడిపిస్తూంటే, వాళ్ళ మీద కోపం వచ్చేది. మా అక్కని ఎవరేనా అంటే ఊరుకునేది లేదు జాగ్రత్త అంటూ వాళ్ళని భయపెట్టేది శశి.

తన చెల్లెలు శశికి తనంటే ఎంత ప్రేమో అని అనుకున్నా - వెంటనే నువ్వేం చెప్పక్కర లేదు. వాళ్ళకి నేను సమాధానం చెప్పగలను అంటూ డబాయించేది.

''చూశావురా తమ్ముడూ'' అంటూ బేలగా, తమ్ముడికి చెప్పేది శశి.

అమ్మా నాన్నా తననేం అనరని అది అలా తయారైందని పెద్దవాడిలా ఓదార్చేవాడు రవి.

జయకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. పిల్ల నచ్చలేదని కొందరూ, కట్నం చాలదని కొందరూ అంటున్నారు.

మొత్తం మీద పెళ్ళి చూపుల తతంగం దాకా వచ్చి ఆ తర్వాత ఏదో కారణం వల్ల పెళ్ళి కుదరడం కష్టంగా ఉంది అని పరంధామయ్యా విశాలాక్షమ్మా జయని చూసి జాలిపడుతున్నారు. ఓ మంచి సంబంధం తీసుకు వచ్చి అసలు పెళ్ళి చేయగలమా? అని బాధపడ్డారు.

అది విన్న జయ, ''వాళ్ళు అడిగినంత కట్నం ఇచ్చి, నా పెళ్ళి చేసి, ఆ తర్వాత, మీరేం తింటారు? చెల్లి పెళ్ళి, రవి చదువు ఎలా చెప్పిస్తారు? అసలు కట్నం పుచ్చుకునే వాణ్ణి నేను పెళ్ళిచేసుకోను'' అంది.

''ఎందుకలా పౌరుషపడతావు? చదివిస్తే మంచి మార్కులు రావటం లేదుగా? ఇంక పెళ్ళే శరణ్యం నీకు. నాలాగా మంచి మార్కులువస్తే, పెద్ద చదువులకు వెళ్ళొచ్చును అంది శశి గర్వంగా చూస్తూను.

"నీకెందుకు నా గొడవ? ఇక్కడి నుంచి వెళతావా లేదా?" అంటూ తరిమి కొట్టింది జయ. జయకి తెలుసును - తనకంటే తెలివి అయినది చెల్లెలు అని. అయినా తన పెద్దరికం చూపిస్తూ కసిరికొట్టేది.

కాలం గడుస్తోంది. చిన్నవాళ్ళు పెద్దవాళ్ళు అవుతున్నారు. డబ్బున్న వాళ్ళు ఇంకా డబ్బున్నవాళ్ళు అవుతున్నారు. పేదవాళ్ళు మరీ పేదవాళ్ళు అవుతున్నారు. పెరిగే ఖరీదులతో పెరగలేక పోతున్నారు ప్రజలు. జయ టెంత్ క్లాస్ పాసుకాలేదు. శశిమాత్రం కాలేజీ చదువుకి వెడుతోంది.

వాళ్ళ ఇద్దరికీ ముద్దు అయిన చిన్న తమ్ముడు రవి.... బాగా కబుర్లు నేర్చాడు. ఇప్పుడు చదువుతోబాటు "జయక్క పెళ్ళై అత్తారింటికి వెళ్ళిపోతే, మన ఇద్దరికీ ఏం తోస్తుంది? మనతో దెబ్బలాడే వాళ్ళుండరుగా?" అనేవాడు.

ఆ మాటలకు కొంచెం నవ్వి - "జయక్క వింటే కోప్పడుతుందిరా!" అంటూండేది శశి.

జయకి ఇంట్లో బోరుగా ఉండేది.

శశికి కాలేజీలో చదువుతో, ఫ్రెండ్సుతో, బిజీగా ఉండేది. అందంగా అలంకరించుకుని, కాలేజీకి వెళుతున్న చెల్లెల్ని చూస్తే, ఏదో కోపం మనసుని నులిపెట్టేది జయకి.

ఎదిగి ఇంట్లో ఉన్న కూతురు జయకి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపాలనే పట్టుదలతో రోజుకో సంబంధం చూస్తున్నారు పరంధామయ్య, విశాలాక్షమ్మాను.

ఇంతకీ ఎవరికి ఎవరికి ఘటనో, మన మెన్ని పెళ్ళి సంబంధాలు చూసినా ఆ టైము రావాలి, అని వేదాంత ధోరణిలో ఆలోచించసాగారు. పెద్ద ఇంజనీర్లూ డాక్టర్లూ పెళ్ళి కొడుకులుగా వెతకలేంగాని, బేంకి ఉద్యోగం అయితే, బేషే అనుకున్నారు. చివరికి అల్లాగే, బేంకిలో జాబ్‌చేసే పెళ్ళికొడుకు ముప్ఫైవేలు కట్నం, అపైన లాంఛనాలూ, పెళ్ళివారికి మూడు పూటలా విందుభోజనం, ఆ పైన బేండ్ మేళం ఖర్చుతో సహా పెళ్ళిమాటలు జరిగాయి. పెళ్ళికొడుకు రఘు. పిల్లవాడు బాగానే ఉన్నాడు. జయ నచ్చిందన్నాడు. దాంతో పెళ్ళి ఖాయం చేసారు. పెళ్ళి ఖర్చులు అనుకున్న కంటే ఎక్కువే అయినా ఇల్లు తాకట్టు పెట్టి, డబ్బు తెచ్చాడు పరంధామయ్య.

జయ పెళ్ళి కుదిరిందని ఆ ఇంట్లో వారికందరికీ ఎంత ఆనందంగా ఉందో, ఇల్లు తాకట్టు పెట్టినందుకు అంత బాధగానూ ఉంది.

పెళ్ళి పనులు చేయిస్తున్న పరంధామయ్యా, విశాలాక్షమ్మా తమ అసమర్థతకీ, తమ దబ్బులేమికి, తామే తలుచుకుని తలుచుకుని కించపడుతున్నారు. చాలీచాలని గుమస్తాగిరీ ఉద్యోగంలో, తండ్రి ఇచ్చిన ఇల్లు నిలబెట్టుకోగలమా? ఈ అప్పు ఎలా తీర్చాలి? అనే ఆలోచనలేకాని, ఏ చీర కొనాలి ఏ నగ కొనాలి? అనే సరదాయే లేదు వారిద్దరికీను.

జయకి పెళ్ళి కుదిరింది అనగానే మనసులో కోరికలు, పులకింతలు పెడుతూంటే, ప్రతి కొమ్మా గాలికి ఊగినట్లు, కులుకుతో, పులకరించి, కన్నె మనసు కలవరంతో, కంగారు పెడుతోంది. కన్నెపిల్ల, గృహిణికాగానే ఎన్ని సమస్యలు ఎదుర్కోవాలో తెలియక. శశికి డిగ్రీ చదువులోకి రావడంతో, చదువుతోంది ఎంతో శ్రద్ధతో. ఫస్టుక్లాసు రావాలని పట్టుదలతో ఉంది. అక్క జయ పెళ్ళి అయితే, అది అత్తవారింటికి వెళ్ళిపోతే, ఇల్లంతా చిన్నబోతుందని దిగులు. అయితే, కట్టుకున్న బొమ్మరిల్లు ఇంక తనదేలే అనే చిలిపి ఆలోచన. వెంటనే దానికి నచ్చిన ప్లేసులో కట్టింది. తనకి సరదాగా ఉన్నట్లు తనని బొమ్మరిల్లు కట్టుకోనివ్వలేదు అమ్మ. అందుకే తనకా బొమ్మరిల్లు వద్దు. పెద్ద చదువులు చదువుకుని, లాయరు చదివి, ప్రాక్టీసు పెట్టి, పబ్లిక్ ప్రాసిక్యూటరు అయి, ఆ తర్వాత జడ్జిమెంటు చెపుతూ ఉంటే, అందరూ ఆశ్చర్యపోవాలి. స్త్రీల సమస్యల మీద, గట్టిగా వాదించి, వారికి న్యాయం చేకూర్చాలి. స్త్రీలందరూ, మీ మీ హక్కులను వినియోగించుకోండి, అన్యాయం అయిపోకండి. జీవితం అంటే యేమిటనుకున్నారు? ఆదర్శంగా బ్రతకాలి అంటూ శశి గట్టిగా అరుస్తూ గదంతా తిరుగుతూ కోర్టు ప్లీడరుగా అనుకుంది. "శశిఅక్కా శశిఅక్కా'' అంటూ తమ్ముడు కదిపి కుదిపేదాకా, తన పరిస్థితి తనకి అర్థం కాలేదు.

ఎదురుగుండా పరంధామయ్యా, విశాలాక్షమ్మాను. ''ఏం జరిగింది అలా అరుస్తున్నావు" అని అడిగారు. జయ శశికేసి నిర్లక్ష్యంగా చూసి, ''నాటకం రిహార్సల్స్ కాబోలు'' అంది.

శశి కంగారుపడి, 'అబ్బే, ఏం లేదమ్మా! సరదాకి,' అని బలవంతంగా నవ్వేసింది.

'ఏడిసినట్లే ఉంది ఇప్పుడు పిల్లల తెలివి. సినిమానాలెడ్జిగా వీళ్ళకి' అంటూ పరంధామయ్య కోపంగా చూసి వెళ్ళిపోయాడు

'వెర్రి వెర్రి వేషాలెయ్యకు, కాలేజీ చదువులు ఆపేయించగలను' అని విశాలాక్షమ్మ కోపంగా చూసి వెళ్ళిపోయింది.

'అక్కా, శశిఅక్కా! నీ నటన, డైలాగులు అమోఘం. నాకు నచ్చింది' అంటూ టేబిల్ మీద ఎక్కి కూచుని, మఠం వేసుకుని, కుడి చేతిని గీతోపదేశం చేసే పద్ధతిలో పెట్టాడు రవి.

శశి తమ్ముడిని చూసి నవ్వుకుంటూ 'నీ పోజుకూడా బాగుందిరా' అంటూ ముద్దు పెట్టుకుంది.

'నిజం కదు అక్కా!' అంటూ వెనుతిరిగేటప్పటికి, జయ నిర్లక్ష్యంగా చూస్తూ అక్కడినించి వెళ్ళిపోయింది.

అనుకున్న ప్రకారం కట్న కానుకలతో, సత్కరించి, అల్లుడు అడిగిన వన్నీ తీరుస్తూ, సూట్లు, బూట్లుతో సహా యిచ్చి, పెళ్ళివారు కోరిన కోరికలు తీర్చి, మూడు పూటలా భోజనాలవేళ, వినయంగా వడ్డించి, పిండి వంటలతో వాళ్ళ నోర్లు మూయించారు. అప్పగింతల తతంగం ఘనంగా పూర్తిచేశాడు పరంధామయ్య.

జయ, వడికట్టు భారంతో అత్తవారింటికి బరువుగా పాదం కదపలేక కదపలేక కదుపుతూ ఉంటే, కళ్ళ నీళ్ళు ధారలు కడుతూ ఉంటే, కన్నవారిని వదిలి వెళ్ళలేక భోరున ఏడ్చేసింది. పరంధామయ్య, విశాలాక్షమ్మ కళ్ళనీళ్ళు వత్తుకుంటూ, చిన్న పిల్లాడు రవి ఎక్కు పెట్టి ఏడుస్తూంటే, మధ్యలో ఊరుకో బెడుతున్నారు వాణ్ణి. అప్పగింతల పాట సన్నాయి అక్కడివారి అందరి హృదయాలనీ మంచులా కరిగిస్తోంది. కళ్ళ నీళ్ళు కురిపిస్తోంది. 'శశి ఏది నాన్న గారూ?' అంది జయ గమ్మున ఒక అడుగు వెనక్కి వేస్తూను. పెళ్ళికొడుకు రఘు చెంగూ, జయ కొంగూ ముడిపడి ఉన్నాయి.

"వర్షం వస్తోంది, తొందరగా పదండి రైలుకి. అందరం ఆడపిల్లను కన్నవాళ్ళమే- మీరు ఒక్కరే కాదు'' అంటూ ఆవేశంగా అరిచాడు పెళ్ళికొడుకు తండ్రి. శశికి, అక్క జయ, అత్తవారింటికి వెళ్ళిపోతోందని గుండెల్లో పెద్ద బాధ వచ్చింది. అక్కతో అవేళ బొమ్మరిల్లుకోసం దెబ్బలాడిన సంగతి జ్ఞాపకంవచ్చి

మరింతగా బాధపడుతూ, 'అక్కా! నువ్వంటే యింత ప్రేమ ఉందని ఇప్పుడే తెలుసుకున్నాను'' అంది.

సరిగా అక్కడికి వచ్చిన జయ, రఘు ఆ మాటలు విన్నారు.

చెల్లెలు శశిని ప్రేమగా కౌగలించుకొని అప్యాయతతో నిమిరింది జయ.

"బావగారూ! మా అక్క వట్టి అమాయకురాలు. కోపం మటుకు ముక్కు మీద ఉంటుంది- అంతే! ఈ బంగారు బొమ్మని ఎలా చూసుకుంటారో?'' అంది శశి, బావగారితో కొత్తగా మాట్లాడటం, కొత్తమీద కొంచెం తడబడుతూను.

''ఇంతవరకూ చలాకీగా తిరుగుతూ అందర్నీ ఛలోక్తులతో నవ్వించావు. ఇప్పుడీ బేలమాటలేమిటి?'' అంటూ శశి మాటలకు పకపక నవ్వి, ''అప్పుడప్పుడూ నువ్వూ వచ్చి చూస్తూ ఉండు- మేము ఎలాంటివారమో మీకు తెలుస్తుంది'' అన్నాడు రఘు ఛలోక్తితో.

పక్కన ఉన్న ఓ బంధువు వరస కలిపి, హాస్యానికి, ''అక్కగారికి కూడా సారెబిందెకి బదులు నువ్వెళ్ళు'' అంది

ఆ మాటలకు అంతా నవ్వారు.

శశికి మాత్రం ఈ మాట అపశ్రుతిలా వినిపించి చిరాకుపడి, ''ప్రతి వాళ్ళకూ మాట్లాడటం రాదు. అది తెలియదు సరికదా, ఛలోక్తులు కూడా వేస్తారు'' అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

జయ అత్తారింటికి వెళ్ళింది కాపురానికి కొండంత అప్పు చేసినా, తమ తాహతుకి మించిన కట్నం ఇచ్చామని దిగులు ఉన్నా, కూతురి పెళ్ళి ఘనంగా చేశామన్న గర్వం విశాలాక్షమ్మ ముఖంలో కనిపిస్తోంది.

పరంధామయ్యకి మాత్రం నెల జీతంలో అప్పుకోసం ఎంత డబ్బు దాచాలి, ఇంట్లో నెలసరి ఖర్చులు ఏమేమి తగ్గించాలి అనే ధ్యాసే! గుండె దిటవుకలవాడు కనుక రోజులు నెట్టుతున్నాడు, ఖర్చులు తగ్గించుకుని.

జయ కాపురం బాగానే ఉన్నట్టు తెలుస్తోంది, ఉత్తరాలవల్ల. పండగలకి అల్లుడూ, కూతురు జయ రావడం, వెళ్ళడం, అల్లుడు పాతబడి, కష్ట సుఖాలు చెప్పుకోవడంతో, కట్నం అల్లుడికి ఎక్కువ ఇచ్చాము అనే దిగులు పోయింది విశాలాక్షమ్మకీ పరంధామయ్యకీనూ. రఘు పండగలకి వస్తున్నాడు. మరదలు

శశికి చీరలు తెస్తాడు. బావమరిది రవికి కావలసినవన్నీ కొంటాడు. సినిమాలు షికార్లు ఉన్నంతలో సరదాలు అన్నీ బాగానే ఉన్నాయి.

జయ వచ్చినప్పుడల్లా కొత్త చీరలు, రకరకాల గాజులతో వస్తుంది. అత్తవారింటిని గురించి ఆనందంగా చెపుతుంది.

ఈ తెలుగు సినిమాలూ కథలూ చూసి హడలిపోయేవారం, మనకు ఎలాంటి అల్లుడు వస్తాడో అని. ఫరవాలేదు అని సంతృప్తిగానే ఉన్నారు, ఇంట్లోని వారంతాను.

కాలం గడుస్తోంది. శశి అనుకున్న ప్రకారం బి.ఎ. పూర్తి చేసింది. ఫస్టు క్లాసు వచ్చింది, కాని, లాలో సీటు రాలేదు, రకరకాల ఇబ్బందుల వల్ల పోనీ, ఎమ్.ఎ. సీటు వస్తుందేమోనని ప్రయత్నం చేసింది, అదీ రాలేదు.

తీరని కోరికలు మనసుని నులిపెడుతున్నాయి అయినా, ఊరికే కూర్చో లేక పదిమందికి పాఠాలు చెపుతోంది.

జయకి తొందరలో బాబు పుట్టబోతున్నట్లు ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చూసి అదోలా ఉన్నారు. తొందరలో పురిటికి తీసుకురావాలి. బార సాల చెయ్యాలి. పెళ్ళికి చేసిన అప్పు సగం కూడా తీరలేదు. అయినా, తప్పే దేముంది? జయని పురిటికి తీసుకువచ్చారు. జయ అత్తవారింటి దర్జాలకు అలవాటు పడ్డంతో, పుట్టింటి వంటలు, మాటలు, కొద్దిగా ఇబ్బందిని కలిగిస్తున్నాయి.

'మా అత్తగారు బాలా మంచివారు. నేనంటే చాలా ప్రేమ' అని జయ చెపుతూ ఉంటే, విశాలాక్షమ్మ కాని, శశిగాని అంతగా ఇష్టపట్టం లేదు. అది గమనించి ఆశ్చర్యపోయేది జయ, 'ఎంత ఈర్ష్య?' అని. జయకి క్రమేపీ నెలలు నిండాయి. ఆవేళ గవర్నమెంటు హాస్పిటల్లో జేర్పించారు పురిటి టైము అని. డాక్టర్ పరీక్ష చేసి, కడుపులో పిల్ల అడ్డం తిరిగింది, సిజరీన్ చెయ్యాలని, సిజరిన్ చేసింది. కాని, పిల్ల దక్కింది. "తల్లి జయని మేము రక్షించలేకపోయాం, సారీ!" అన్నారు. ఇంటిల్లిపాదీ ఘొల్లున ఏడ్చారు.

రఘు వచ్చి అంతా విని, జయ తనకి అన్యాయం చేసి వెళ్ళిపోయిందని భోరున ఏడ్చాడు. పరంధామయ్య విశాలాక్షమ్మా జరిగిందాని గురించి బాధ పడుతూ, పసికూనని శశికి ఇచ్చి పాలూ, నీళ్ళూ చూడమన్నారు. జయ అక్క-

కోసం ఏడుస్తూనే, తన వళ్ళో పసిపిల్లరూపంలో అక్కని చూసుకుంటోంది శశి. రవి, బావగారి దగ్గరికి వెళ్ళి, 'జయక్క ఎక్కడికి వెళ్ళింది, మళ్ళీ ఎప్పుడు వస్తుందీ' అని అడిగాడు రఘు మతిలేనివాడిలా మాట్లాడలేక, శశివైపు ఆశగా చూశాడు

విశాలాక్షమ్మ అంత బాధలోనూ అల్లుణ్ణి పరిశీలనగా చూసింది. శశిని చూసింది. తన ఆలోచనలకు తనే తలపంకించింది.

రోజులు గడుస్తున్నాయి. మరుపు మానవ సహజం ఆశ అంతకంటే సహజం కదా?

ఓరోజున శశి దగ్గర కూచుని, విశాలాక్షమ్మ పరంధామయ్యలు బతిమి లాడుతూ చెప్పారు

"నువ్వు బావని పెళ్ళి చేసుకుని తీరాలి. లేకపోతే, ఈ పసికూన సంగతి ఏంకావాలి?" అని ప్రశ్నించారు.

శశి ఏదో చెప్పబోయింది నోరు మెదపనీయలేదు. 'నో' అననీయలేదు.

"అక్క పెళ్ళికి చేసిన అప్పు తీరలేదు. బంగారంలాంటి పిల్లవాడు రఘు, నిన్ను చూసి మోజుపడుతున్నాడు." అన్నారు.

ఆ మాటలు విని, చెవులు మూసుకుంటూ, నోటిలో పమిటకొంగు కుక్కుకుని బోరున ఏడ్చేసింది శశి.

'నేను కోరుకోని కోవెలకి వెళ్ళను' అందామనుకుంది. *

(రచన - '91)